సాక్షి రంగారెడ్డి

సోమవారం। 18। మార్చి। 2024



పరిష్కారం దిశగా..

ఫార్మాసిటీ భూబాధితుల పట్టా భూముల రికార్డుల మార్పు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. 8లో▸



పేదల సంక్షేమానికి కృషి

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
సోమవారం (సాయంత్రం) 6:32	మంగళవారం (ఉదయం) 5:00

న్యూస్‌రీల్

లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ గత ఫిబ్రవరి 26వ తేదీ నుంచే అమలులోకి వచ్చిన సందర్భంగా ప్రజావాణిని రద్దు చేసినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు కార్యక్రమం ఉండదని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం యథావిధిగా కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

కన్స్యూమర్ రైట్స్ చైర్మన్‌గా నగేష్‌కుమార్



నగేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కొత్తూరు: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ జిల్లా కమిషన్ చైర్మన్‌గా కొత్తూరు పట్టణానికి చెందిన నగేష్‌కుమార్ రెండోసారి ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలో జాతీయ కన్స్యూమర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తనను ఎన్నుకోవడంతో పాటు నియామకపత్రం అందించినట్లు నగేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా దుకాణాల్లో కొనుగోలు చేసే వస్తువులు, వాహనాలు, పరికరాలకు వినియోగదారులు తప్పకుండా బిల్లు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉండి వారికి అన్ని విధాలా సాయం చేస్తానని తెలిపారు.

బంజార మిషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్ నాయక్



నియామకపత్రం అందుకుంటున్న కాట్రావత్ రాజేష్ నాయక్

మహేశ్వరం: జాతీయ బంజార మిషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి తండాకు చెందిన కాట్రావత్ రాజేష్ నాయక్ నియమితులయ్యారు. నగరంలోని జాతీయ బంజార మిషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ నాయక్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. బంజారుల సమస్యలపై పోరాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈము రైతులను ఆదుకోండి

ఉప ముఖ్యమంత్రికి రైతుల వినతి



డిప్యూటీ సీఎం భట్టిని కలిసి వినతిపత్రం అందజేసిన ఈము రైతులు

షాద్‌నగర్: ఈము పక్షులు పెంచి ఆర్థికంగా ఎంతో నష్టపోయామని, తమను ఆదుకోవాలని కోరుతూ ఈము పక్షుల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఈము రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్లోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. నాబార్డు మాటలు నమ్మి చాలామంది రైతులు ఈము పక్షులను పెంచారన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.30లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందని ప్రకటించడంతో చాలామంది ముందుకు వచ్చి పక్షులను పెంచారని తెలిపారు. ప్రభుత్వం సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో పెట్టుబడి భారంతో భారీ నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాలు మాఫీ చేసి ఈము రైతులను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

నిబంధనలు 'గాలి'కి..

విషం చిమ్ముతున్న పరిశ్రమలు

- కలుషితమవుతున్న గాలి, నీరు
- కబళిస్తున్న కాలుష్య భూతం
- తెబ్బతింటున్న ప్రజారోగ్యం
- పట్టించుకోని పీసీబీ అధికారులు



కొత్తూరు పరిధిలోని ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరిశ్రమలు విషం చిమ్ముతున్నాయి.. ఉదయం, సాయంత్రం వేళల్లో విష వాయువును బయటికి వదులుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పలు బల్క్ డ్రగ్ కంపెనీలు వ్యర్థాలను గుట్టుగా బయటికి తరలించి సమీపంలోని చెరువులు, కుంటల్లో కలిపేస్తున్నాయి. విపరీతమైన ఘాటు వాసనలు వెదజల్లుతున్నాయి. ఉపాధి సంగతేమో కానీ ఊపిరాడనివ్వడం లేదు. పర్యావరణానికి హాని చేయమని అనుమతులు పొంది, తర్వాత నిబంధనలు 'గాలి'కి వదిలేస్తున్నాయి. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి, ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆయా పరిశ్రమల యజమానులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాలుష్యకారక పరిశ్రమలపై ఫిర్యాదులున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

అక్కడే అధికం..

జిల్లాలో మొత్తం 633 కాలుష్య కారక పరిశ్రమలు ఉండగా, వీటిలో 81 గ్రీన్ కేటగిరీ, 358 ఆరేంజ్ కేటగిరీ, 194 రెడ్ కేటగిరీకి చెందినవి ఉన్నట్లు గుర్తించారు. కొత్తూరులో 40, ఫరూఖ్‌నగర్‌లో 37, మహేశ్వ రం, కడ్తాల్‌లో 17 చొప్పున రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో 47 రైస్ మిల్లులు ఉన్నాయి. అత్యధికంగా ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఏర్పాటైన వీటి నుంచి వెలువడుతున్న కాలుష్యం వాయు, నీటి నాణ్యతతో పాటు ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

జనం మధ్యే స్టోన్‌క్రషర్లు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 111 జీఓ పరిధిలోని కోకాపేట్, వట్టి నాగులపల్లి, గోపన్‌పల్లి, కొల్లూరు, కొత్వాల్‌గూడ, శంకర్‌పల్లి, మిర్జాగూడ, జన్వాడ సహా గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసరాల్లో భారీగా రెడీమిక్స్ ప్లాంట్లు, స్టోన్ క్రషర్ మిషన్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటి నుంచి వెలువడుతున్న దుమ్ము ధూళి కణాలతో పర్యావరణం దెబ్బతింటోంది. నీరు కలుషితమవుతోంది. ప్రస్తుతం వీటిపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసులు నడుస్తున్నాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు నిషేధమైనప్పటికీ యూనిట్ల ఏర్పాటుకు పరిశ్రమల శాఖ అనుమతులు ఇస్తుండటం, విద్యుత్ అధికారులు కరెంట్ కనెక్షన్లు జారీ చేస్తుండటం, పీసీబీ అధికారులు నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తుండడం విశేషం.

మచ్చుకు కొన్ని ..

- జేపీదర్గా వద్ద ఉన్న ఓ ఫార్మా కంపెనీపై జాతీయ హరిత ట్రిబ్యూనల్‌లో కేసు కొనసాగుతోంది. కెమికల్ పొల్యూషన్‌తో ఆ కంపెనీలో పని చేసే వారితో పాటు చుట్టు పక్కల పని చేసే వారు కేన్సర్ బారినపడుతున్నారు. సీఎస్‌ఆర్ ఫండ్స్ కూడా ఖర్చు చేయడం లేదు. ఈ డబ్బుతో స్థానిక ప్రజా ప్రతినిధులను మేనేజ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- యాచారం సమీపంలో పవర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. దీని నుంచి తీవ్రమైన వాయు కాలుష్యం వెదజల్లుతోంది.
- బండరావిర్యాలలో స్టోన్ క్రషర్లు పెద్ద ఎత్తున కాలుష్యానికి పాల్పడుతున్నాయి. జాతీయ హరిత ట్రిబ్యూనల్‌లో కేసులు కొనసాగుతున్నాయి. వీటిని నిలిపేయాలని స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. అయినా గుట్టుగా కార్యకలాపాలు సాగిస్తూ కాలుష్యాన్ని వెదజల్లుతూనే ఉన్నాయి.
- కాటేదాన్, షాద్‌నగర్, మహేశ్వరం మంఖాల్ పారిశ్రామిక వాడల్లోనూ ఘాటైన వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

జిల్లాలో పారిశ్రామికవాడలు

పారిశ్రామిక వాడ	విస్తీర్ణం (ఎకరాల్లో)
హార్డ్‌వేర్‌పార్క్-1	310
ఫ్యాబ్‌సిటీ/ఈసిటీ	602
ఆదిబట్ల ఐటీ	160.20
ఎరోస్పేస్ ఆదిబట్ల	339.10
ఐపీ నాదర్‌గుల్	129.21
మంఖాల్	107.12
ఐడీఏ కాటేదాన్	245
ఏడీఏ కొత్తూరు	181.60
ఆటోనగర్	600
హార్డ్‌వేర్ పార్క్ ఫేజ్-2	250
ఈఎంసీ మహేశ్వరం	340
ప్లాస్టిక్ పార్కు	179.32
ఎంఎస్ఎంఈ ఇబ్రహీంపట్నం	129
ఐపీ చందనవెల్లి	1422.62
కొంగరకలాన్	320
ఫార్మాసిటీ	19,333.20
ఎలిమినేడు	638.36
రహేజా/మైండ్ స్పేస్ ఐటీ పార్కు	109.36
గోల్ఫ్‌కోర్స్	258.36
సైబరాబాద్ కన్వెన్షన్	15.139
బౌల్డర్‌హిల్స్	17
ఐఐఆర్ఎం/నానక్‌రాంగూడ	5
మాదాపూర్ రహేజా	109.36
సైబర్ టవర్స్ ఎల్ అండ్ టీ	6
సైబర్ గేట్‌వే	8.65
సైబర్ పెరల్, హైటెక్‌సిటీ	6.05

జిల్లాలో కాలుష్య కారక పరిశ్రమలు

డివిజన్	పరిశ్రమలు	గ్రీన్ కేటగిరీ	ఆరెంజ్ కేటగిరీ	రెడ్ కేటగిరీ
చేవెళ్ల	82	12	54	16
ఇబ్రహీంపట్నం	142	21	84	37
కందుకూరు	138	18	70	50
రాజేంద్రనగర్	11	-	06	05
షాద్‌నగర్	260	30	144	86

ప్రజారోగ్యానికి ముప్పు



చాలా పరిశ్రమలు నిబంధనలు పాటించడం లేదు. ఇష్టారీతిన వ్యర్థాలను తరలిస్తూ చెరువులు, కుంటలను కలుషితం చేస్తున్నాయి. ప్రజారోగ్యానికి ప్రాణాంతకంగా మారాయి. నీటి కాలుష్యంతో చేపలు, పక్షులు, ఇతర జంతువులు మృత్యువాత పడుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి సిఫార్సులను అమలు చేయాలి.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ రాష్ట్ర నాయకుడు

రోజుకో మలుపు

- కారు దిగి.. హస్తంలో చేరి
- పార్టీ మారిన ఎంపీ రంజిత్‌రెడ్డి
- చేవెళ్లలో మారుతున్న సమీకరణాలు
- రసవత్తరంగా రాజకీయం



దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల వేళ చేవెళ్ల నియోజకవర్గం పరిధిలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కారు దిగి హస్తం చెంతకు చేరారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సరిగ్గా ఐదేళ్ల కిత్రం 2019 మార్చిలోనే లోక్‌సభ ఎన్నికల సమయంలోనే వరంగల్‌కు చెందిన వ్యాపారవేత్త అయిన గడ్డం రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని చేవెళ్ల ఎంపీగా అవకాశం కల్పించింది. అప్పటి వరకు ఈ ప్రాంత నాయకులు, ప్రజలు ఎవరికీ పరిచయం లేకపోయినా అప్పట్లో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అని నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. అనతికాలంలోనే ఆయన తనదైన శైలిలో రాజకీయంలో రాణించి పేరు సంపాదించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. పార్టీ నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ జీవితం ఎంపీతోనే మొదలైంది. ఆ ఎంపీ పదవి ముగియక ముందే రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలు కావడం.. ఎమ్మెల్యేలు, నాయకులంతా ఒక్కరొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆయన ఆత్మరక్షణలో పడిపోయారు. అందరికంటే ముందే చేవెళ్ల అభ్యర్థిగా మరోసారి రంజిత్‌రెడ్డి పేరు ప్రకటించినప్పటికీ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన పోటీకి వెనుకంజ వేశారు. అప్పటి నుంచి మౌనంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. తెరవెనుక పావులు కదిపి చివరికి హస్తం గూటికి చేరారు.

కాంగ్రెస్ పార్టీలో కలిసి వచ్చేనా..?

ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టే. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇన్నాళ్లు పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి అని ఆమెను పార్టీలోకి తీసుకు వచ్చి పరిచయం కూడా చేశారు. అనూహ్య పరిణామాలతో ఆమెకు టికెట్ ప్రకటించ లేదు. రంజిత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీ కావడంతో విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో కాంగ్రెస్ అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. రంజిత్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తే సునీతా మహేందర్‌రెడ్డి పరిస్థితి ఏమిటనే దానిపై చర్చ నడుస్తోంది. ఆమెకు మల్కాజిగిరి ఎంపీ స్థానం ఇస్తారనే ప్రచారం సాగుతోంది. కానీ ఆమె అక్కడి నుంచి పోటీ చేస్తారా లేదా అనేది సంశయంగా మారింది. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగితే పార్టీ నాయకులు ఏ మేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీ టికెట్ హామీతోనే పార్టీ మారిన సునీతామహేందర్‌రెడ్డి వర్గం సపోర్టు చేస్తుందా.. బీఆర్ఎస్‌లో ఆయన వర్గం నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట నడుస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బలమైన అభ్యర్థిగానే కాకుండా స్థానికుడిగా ఉన్నారు. బీఆర్ఎస్ కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మరి కాంగ్రెస్ నుంచి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

అభివృద్ధిలో భాగంగానే..

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల అభివృద్ధిలో భాగంగానే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తం గూటికి చేరిన అనంతరం ఆదివారం ఆయన మొయినాబాద్ మండలం ఎన్కెపల్లి సమీపంలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రానున్న రోజుల్లో కార్యాచరణపై రంజిత్‌రెడ్డి వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కందవాడ బల్వంత్‌రెడ్డి, దేవురంపల్లి మహేందర్‌రెడ్డి, వెంకటాపూర్ బాలరాజ్, చేగూరి రామకృష్ణగౌడ్, ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రాంరెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తొర్రూర్ గ్రామానికి చెందిన మల్‌రెడ్డి రాంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్తి పేరు: మల్‌రెడ్డి రాంరెడ్డి

పుట్టినతేదీ: 10 ఫిబ్రవరి 1962

తండ్రి: బాల్‌రెడ్డి

కుటుంబం: భార్య అనురాధ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు

చేపట్టిన పదవులు: 2001లో తొర్రూర్ నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. హయత్‌నగర్ ఎంపీపీగా సేవలందించారు. 2014లో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2023లో ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేశారు. ఆయన సతీమణి అనురాధ తొర్రూర్ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆయన సోదరుడు. పార్టీకి విధేయుడిగా, రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు.

చేవెళ్లను గెలిచి మోదీకి కానుకగా ఇద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల సీటును గెలిచి మోదీకి కానుకగా అందిద్దామని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీహెచ్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం మొత్తం పేదల గుండెల్లో మోదీ ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నాయకులు పార్టీలు మారుతూ ఒకచోటకు చేరుతున్నారని, వారంతా ఏకమైనా బీజేపీని ఎదుర్కోలేరని అన్నారు. మతతత్వ పార్టీ అని ఆరోపించే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే నిజమైన మతతత్వ పార్టీలని మండిపడ్డారు. చేవెళ్లలో మనకు ఎవరూ పోటీ లేరని మనకు మనమే పోటీ అన్నారు. పోటీ చేసేందుకు ఆయా పార్టీలకు అభ్యర్థులు లేక స్థానికేతరులను తీసుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం, నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేశ్, రమణారెడ్డి, అనంత్‌రెడ్డి, శర్వలింగం, మధు, కుమార్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోదీనే ప్రధాని ..

బీజేపీకి ఓటు వేయడం అంటే దేశాభివృద్ధికి వేసినట్లేనని.. మరోసారి ప్రధానిగా మోదీకే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు గొడిచర్ల వెంకటేశ్ అనుచరులతో పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి బాటలో నడవాలంటే మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమరం.. తనిఖీలు ముమ్మరం



కోనాయిపల్లి శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

షాద్‌నగర్: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగడంతో లోక్‌సభ ఎన్నికల సందడి మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసుల ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం నేతృత్వంలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతమైన రాయికల్ టోల్ ప్లాజా వద్ద, జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ వద్ద పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలను నియమించి రేయింబవళ్లు తనిఖీ చేయనున్నారు. ఎన్నికల నేపథ్యంలో సర్వేలెన్స్ స్టాటిక్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీల్లో షాద్‌నగర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున నగదు పట్టుబడి విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బంగారు, వెండి ఆభరణాలు, మద్యం రవాణాపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ప్రచార ఫ్లెక్సీల తొలగింపు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్‌లో ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫొటోలు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచారాల ఫ్లెక్సీలు, బ్యానర్లు తీసివేస్తున్నారు.

నగదుకు ఆధారాలు ఉండాల్సిందే..

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ప్రజలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం అన్నారు. మండల పరిధిలోని వికారాబాద్, రంగారెడ్డి జిల్లా సరిహద్దులోని అంతారం బస్‌స్టేజీ వద్ద ఆదివారం పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో అనుమతిలేని డబ్బులు రవాణా చేయడం నేరమన్నారు. రూ.50వేలకు మించి నగదుకు ఆధారాలు లేకుంటే సీజ్ చేయటం జరుగుతుందన్నారు. ఆధారాలు పక్కాగా ఉండాల్సిందేనని చెప్పారు. అందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు ఉన్నారు.

విధేయతకు పట్టం

- చల్లా నర్సింహారెడ్డిని వరించిన కార్పొరేషన్ పదవి
- తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం



చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ప్రభుత్వం నియమించింది. కాంగ్రెస్‌ను నమ్ముకొని క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించారు. సాధారణ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. విధేయతకు పట్టం కడుతూ అధిష్టానం రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవిని కట్టబెట్టి గౌరవించింది.

ఇదీ చల్లా ప్రస్థానం..

1985లో కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1988లో సరూర్‌నగర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1990–95 వరకు జిల్లెల్‌గూడ ఉప సర్పంచ్‌గా, 1995లో సరూర్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1995–2000 వరకు జిల్లెల్‌గూడ సర్పంచ్‌గా పని చేశారు. 2001లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి సరూర్‌నగర్ జెడ్పీటీసీగా గెలుపొందారు. 2006 నుంచి 2010 వరకు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, 2010 నుంచి 2019 వరకు పీసీసీ కార్యదర్శిగా పని చేశారు. 2019లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అధిష్టానం నియమించింది. అప్పటి నుంచి అదే పదవిలో కొనసాగుతున్నారు.

ఇచ్చిన హామీ మేరకు..

గత అంసెబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం టికెట్ కోసం ప్రయత్నించగా అధిష్టానం నిర్ణయం మేరకు పోటీ నుంచి తప్పుకొన్నారు. ఆ సమయంలో పార్టీ అధికారంలోకి వస్తే భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కేఎల్‌ఆర్‌కు మద్దతు తెలిపారు. అన్నట్టుగానే పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ కోసం కష్టపడిన చల్లా నర్సింహారెడ్డికి ఇచ్చిన హామీ మేరకు పదవితో గౌరవించింది. చల్లా నియామకంపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి, నిబద్ధతతో పని చేసినందుకు ఈ పదవి వరించిందని చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జిల్లాతో పాటు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి కట్టబెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే రంగారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే సంక్షేమంలో నంబర్‌వన్ స్థానంలో కాంగ్రెస్ ఉండబోతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలకంపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సింహ, యాదయ్య, రాజు, కాటం రాజు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజ వికాసం

రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా

సనత్‌నగర్: నేటి సమాజంలో మహిళలు లేని రంగం ఏదీ లేదని, అన్ని రంగాల్లో మహిళలు రాణించడంతోనే సమాజ వికాసం జరుగుతుందని రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా అన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 50 మంది నేటితరం మహిళలను సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డ్స్' అందజేశారు. ఆదివారం బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా మాట్లాడుతూ మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాకుండా సేవా, రాజకీయ రంగాల్లోనూ సత్తా చాటుతున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి మహిళల ప్రతిభను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆడపిల్లను కాపాడుకుందాం..ఆడ పిల్లను రక్షిద్దాం అనే ఆలోచనతోనే సంస్థ ఏర్పాటైందన్నారు. ఆడ పిల్లలు ఎక్కడ అఘాయిత్యానికి గురవుతున్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టింది అంటే మహాలక్ష్మి అనుకునేవారని, ఇంటిల్లిపాది సంబరాలు చేసుకునేవారన్నారు. ఆడ పిల్లలను చదివిద్దాం..ఎదగనిద్దాం.. అనే ఆలోచనతో అందరం ముందుకు సాగుదామన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ సృష్టికి, మహిళకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. సృష్టి నిర్మాణంలో మహిళదే ప్రముఖ పాత్ర అన్నారు. పురాణాలు, ఇతిహాసాలు, ఎన్ని చూసినా త్యాగాల్లో మహిళలు ముందుంటారన్నారు. కార్యక్రమంలో ముందడుగు ఫౌండేషన్ ఫౌండర్ రాజేంద్ర, సలహాదారులు కళింగకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి, ముందడుగు డైరెక్టర్ జయరాం, రమేష్‌బాబు, రాజేష్, గంగాధర్, హరి, లక్ష్మీకళ, గీత పాల్గొన్నారు.

మహిళ బ్యాగు నుంచి నగలు చోరీ

చేవెళ్ల: బస్సు ఎక్కేందుకు బస్టాండ్‌కు వచ్చిన మహిళ బ్యాగులో నుంచి మూడున్నర తులాల బంగారు నగలు చోరీ చేశారు. ఈ ఘటన చేవెళ్ల బస్టాండ్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీకి చెందని స్వప్న శంకర్‌పల్లికి వెళ్లేందుకు చేవెళ్ల బస్టాండ్‌కు వచ్చింది. తన బ్యాగులో మూడున్నర తులాల బంగారు నగలు నల్లపూసల దండ, చెవి కమ్మలు, నగదు ఉన్నాయి. ఆమె బస్సు ఎక్కి కూర్చున్న కాసేపటికి బ్యాగును చూడగా జిప్ తీసి ఉండటంతో అనుమానం వచ్చి బ్యాగును చెక్ చేసుకోవడంతో అందులో ఉన్న బంగారు నగలు కనిపించలేదు. దీంతో స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కూలి మృతి

యాచారం: ప్రమాదవశాత్తు ఓ కూలీ మృతి చెందిన ఘటన మాల్ గ్రామంలో చోటు చేసుకుంది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన ఇందూరి శేఖర్(58) గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని నెలలుగా అదే గ్రామానికి చెందిన ఖండే శ్రీను నిర్మిస్తున్న నూతన గృహ నిర్మాణ పనుల్లో కూలీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం శ్రీను నూతన గృహానికి నీళ్లు పట్టి మెట్లపై నుంచి కిందకు దిగి వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. కిందపడిపోయిన శేఖర్‌కు ఇనుపరాడ్డు ఛాతీలో గుచ్చుకోవడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పరిష్కారం దిశగా ఫార్మా భూములు

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలు
- పరిహారం అథారిటీలో జమ చేసిన అధికారులు
- న్యాయ నిపుణులతో సంప్రదింపులు
- భూముల రికార్డులను మళ్లీ రైతుల పేర్ల మీద మార్పు
- అత్యవసర పరిస్థితుల్లో క్రయ, విక్రయాలకు అవకాశం



మంగలిగడ్డలో టీఎస్ఐఐసీ పేరు మార్చేసిన పట్టా భూమి

యాచారం: నిషేధిత జాబితాలో నమోదు చేసిన ఫార్మాసిటీ భూబాధితుల పట్టా భూముల రికార్డుల మార్పు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. కేసీఆర్ సర్కార్ హయాంలో జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని 10 గ్రామాల్లోని 19,333 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూముల్లో ఫార్మాసిటీని నెలకొల్పడానికి నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 9,851 ఎకరాల భూమిని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. అందులో 6,150 ఎకరాల పట్టా, 3,701 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. 9,851 ఎకరాల భూమికి గాను 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని సేకరించి రైతులకు పరిహారం అందజేసింది. మొదట్లో ఫార్మాసిటీ భూసేకరణకు అసైన్డ్ రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాలేదు. గుట్టలు, రాళ్లు, రప్పలతో నిండి ఉండి వ్యవసాయానికి యోగ్యం కాని అసైన్డ్ భూములను రైతులు ఫార్మాకు ఇవ్వడానికి ఆసక్తి చూపారు. అసైన్డ్ భూములకు ఎకరాకు రూ. 8 లక్షలు, ప్రభుత్వ భూములు కబ్జాలో ఉన్న రైతులకు ఎకరాకు రూ. 7.70 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. ఇక పట్టా భూములిస్తే పరిహారం ఎకరాకు రూ. 12.50 లక్షల చొప్పున ఇవ్వడానికి నిర్ణయించడంతో చాలా మంది రైతులు గుట్టలు, రాళ్లు, రప్పలున్న పట్టా భూములను ఫార్మాకు ఇచ్చేశారు.

2,211 ఎకరాలపై మొదలైన వివాదం..

మండలంలోని నాలుగు గ్రామాల్లోని 2,211 ఎకరాల పట్టా భూముల విషయంలో వివాదం మొదలైంది. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని పట్టా భూముల రైతులు తమ భూములను ఫార్మాకు ఇచ్చేది లేదని మొండికేశారు. భూములు కోల్పోతే తమకు జీవనాధారం ఉండదని, ఏడాదికి మూడు పంటలు పండే పట్టా భూములను ఫార్మాకు ఇవ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికార యంత్రాంగం 2,211 ఎకరాల్లో 245 ఎకరాలకు సంబంధించి ముందే హైకోర్టులో కేసు నమోదు కావడంతో, కేసులు లేని మిగతా 1,966 ఎకరాల పట్టా భూములకు సంబంధించి ఆగమేఘాల మీద ఆర్డర్ పాస్ చేసి సర్కార్ పరిహారం అథారిటీలో జమ చేసింది. కనీస సమాచారం లేకుండా భూముల రికార్డులను సర్కార్ టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసింది. దీంతో ఈ ప్రాంతంలో ఫార్మాసిటీనే వద్దని ఆందోళనలు షురూ చేశారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లిన కోదండరెడ్డి

మూడేళ్లుగా రైతులు పడుతున్న బాధలను ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేసి ఇది వరకే భూసేకరణ చేసిన ప్రాంతంలో మెగా టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. తాజాగా ప్రభుత్వం ధరణి భూరికార్డుల సవరణపై స్పెషల్ డ్రైవ్ పెట్టడంతో రైతులు టీఎస్ఐఐసీ పేరు మీద మార్చిన తమ భూముల రికార్డులను మళ్లీ తమ పేర్ల మీద మార్చాలని యాచారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు పెట్టుకున్నారు. కొద్ది రోజుల కింద రైతులు యాచారంలో ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డితో సమావేశమయ్యారు. త్వరలో న్యాయ నిపుణులతో చర్చించి వారి సలహాలు, సూచనలు మేరకు జిల్లా కలెక్టర్, టీఎస్ఐఐసీ అధికారులతో మాట్లాడి నేరుగా సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లి రైతుల పేర్ల మీద మళ్లీ పట్టా భూముల రికార్డులు మార్చేలా కోదండరెడ్డి దృష్టి పెట్టారు. త్వరలో రైతుల పేర్ల మీద పట్టా భూముల రికార్డులు మార్చేసి వచ్చే జూన్ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రైతుబంధు, బ్యాంకుల్లో రుణాలు అందేలా, క్రయ, విక్రయాలు జరుపుకొనేలా చేయడానికి సర్కార్ దృష్టి సారించింది.

కనీస సమాచారం ఇవ్వకుండానే..



కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోని మంగలిగడ్డతండాలో 272 సర్వేనంబర్‌లో 3 ఎకరాల 12 గుంటల పట్టా భూమిని తనకు సమాచారం లేకుండానే టీఎస్ఐఐసీ పేరు మార్చేశారు. పట్టా భూమిని ఫార్మాకు ఇవ్వడం లేదనే అక్కసుతో అప్పటి అధికారులు మాకు అన్యాయం చేశారు. మూడేళ్లుగా రైతుబంధు నిధులు జమ కావడం లేదు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. అథారిటీలో డబ్బులు జమ చేశాం, మీ భూములు ఫార్మాకు పోయినట్టేనని అప్పట్లోని అధికారులు బెదిరించారు. – **నేనావత్ పంథ్యానాయక్, మంగలిగడ్డతండా**

రికార్డుల్లో రైతుల పేర్లు మార్చేస్తాం



ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వమని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొంతమంది రైతుల పట్టా భూములకు రికార్డు పాస్ చేసి పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారు. కొన్ని భూములపై కోర్టుల్లో కేసులు ఉన్నాయి. న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం. త్వరలో టీఎస్ఐఐసీ, సీసీఎల్ఏతో సమావేశమై తిరిగి రైతుల పేర్లపైనే పట్టా భూముల రికార్డులు మార్చేస్తాం. – **ముదిరెడ్డి కోదండరెడ్డి, ధరణి కమిటీ సభ్యుడు**

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహేశ్వరం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని తుమ్మలూరు గేటు సమీపం శ్రీశైలం జాతీయ రహదారిపైన ఈ నెల 8న పోలీస్ పెట్రోలింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉన్నాడు. పోలీసులు మానవతా దృక్పథంతో 108కు సమాచారం ఇచ్చి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. 15న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్యన ఉంటుంది. రోడ్డుపైన భిక్షాటన చేసుకుంటున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం మృతుడి మృతదేహం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో ఉంది. ఆచూకీ తెలిసిన వ్యక్తులు మహేశ్వరం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ పేర్కొన్నారు.

మహిళా మోర్చా రూరల్ అధ్యక్షురాలిగా రమాదేవి



బొక్క నర్సింహారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్ : బీజేపీ మహిళా మోర్చ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షురాలిగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన బొడిగె రమాదేవిని నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదివారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో పార్టీ పెద్దలు పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా మహిళా మోర్చతోపాటు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సింహారెడ్డికి అభినందనల వెల్లువ



చల్లాకి శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్: స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీసీసీ ప్రతి అధికార నిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి చేసిన సేవలకు గుర్తుగా నర్సింహారెడ్డికి రాష్ట్రస్థాయిలో సముచిత స్థానం రావడం హర్షణీయమని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవీ కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు జగన్‌నాయక్ ఉన్నారు.

ఫాంహౌస్‌లో మద్యం పట్టివేత

శంషాబాద్ రూరల్: మండలపరిధిలోని పోశెట్టిగూడ శివారులో గల నవీ ఫాంహౌస్‌లో మద్యం సీసాలను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వీటిని ఇక్కడ నిల్వ చేసేందుకు ఎలాంటి అనుమతి లేదని బాటిళ్లు కలిగి ఉన్న రోహిత్, రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని మద్యాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: తండ్రి మందలించాడని ఓ యువకుడు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పామాపూర్ వాసి ఆరెపల్లి సుబ్రమణ్యం ఊటిపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు వినోద్ (18) రెండు నెలల కిందట కొత్త పల్సర్ బైక్ తీసుకుని ఇంటికి వచ్చాడు.ఆ ద్విచక్రవాహనం కొనేందుకు డబ్బులు ఎవరూ ఇచ్చారని తండ్రి అడిగాడు. దీంతో వినోద్ ఫిబ్రవరి 27న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి విద్యార్థి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన చిన్నపాక సురేందర్ కుమారుడు బాలాజీ (16) 10 తరగతి చదువుతున్నాడు. ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి గుడికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంఎంటీఎస్ రైల్లో వెళుతుండగా ప్రమాదవశాత్తు కాచిగూడ – మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో నుంచి కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదానికి బాధ్యులెవరు?

- ఎగిసిపడిన మంటలు
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- రోడ్డుపై కాలువలా ప్రవహించిన ఆయిల్

గోల్కొండ: యూసుఫ్ టెక్డీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఆయిల్ డిపోలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి టోలిచౌకీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ ఆయిల్ గోదాం అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. 15 ఫైర్ ఇంజిన్లు కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఆయిల్ నిల్వ చేసిన గోదాంకు అసలు అనుమతులు ఉన్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి ఆ సమయంలో వేల బ్యారళ్ల ఆయిల్ గోదాంలో ఉండి ఉండవచ్చునని తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకోగా శనివారం ఉదయం వరకు మెహిదీపట్నం–టోలిచౌకీ రోడ్డుపై ఆయిల్ వరదలా ప్రవహిస్తుండడం గమనార్హం. అదృష్టవశాత్తు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం చోటు చేసుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి ఆనుకుని పెట్రోల్ బంక్, దాని సమీపంలోనే పలు వ్యాపారసముదాయాలు ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే యూసుఫ్ టెక్డీ ఫుడ్ కోర్టు సైతం ఘటన స్థలానికి అతి సమీపంలోనే ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలోని రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు రద్దీగా ఉన్నాయి. రంజాన్ మాసం కావడంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు హలీం కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అగ్ని ప్రమాదంతో ఇటూ షేక్‌పేట్ నాలా వరకు అటు మెహదీపట్నం వరకు ఇరు వైపులా రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోలేదు. కేవలం హుమాయూన్‌నగర్ పోలీసులు మాత్రమే సహాయక చర్యలను పర్యవేక్షించారు.

'పట్నం' శిబిరంలో నైరాశ్యం!

- హస్తిన రాజకీయాలతో మారిన సీన్
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి
- అయోమయంలో జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి





పట్నం మహేందర్‌రెడ్డి పట్నం సునీతారెడ్డి

తాండూరు: కాంగ్రెస్ ఢిల్లీ రాజకీయాలు పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఇతర పార్టీల్లోని తమ మద్దతుదారులను హస్తం గూటికి తీసుకువచ్చారు. పార్లమెంట్ పరిధిలోనూ విస్తృత ప్రచారం చేశారు. కట్ చేస్తే చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకొని తన స్థానం పదిలం చేసుకున్నారు. ఒక్క సారిగా మారిన రాజకీయ సమీకరణలతో పట్నం శిబిరంలో నైరాశ్యం నెలకొంది.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా హ్యాట్రిక్

మూడు దశాబ్దాల పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలను శాసించిన పట్నం కుటుంబం రాజకీయంగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994లో తాండూరు సెగ్మెంట్ నుంచి పట్నం మహేందర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది. వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా పదవి వరించింది. ఆయన సతీమణి పట్నం సునీతారెడ్డి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండు సార్లు, వికారాబాద్ జిల్లా నుంచి జెడ్పీ చైర్‌పర్సన్‌గా హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు పట్నం మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి 2018లో కొడంగల్ అసెంబ్లీ నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం కుటుంబం వేసిన తప్పటడుగులతో పట్నం కుటుంబమే కాకుండా వారి అనుచరగణానికి రాజకీయ జీవితంపై ప్రభావం పడింది.

కొంపముంచిన స్నేహధర్మం

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలు కళాశాల నుంచి మంచి మిత్రులు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో రంజిత్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇప్పించడంలో పట్నం మహేందర్‌రెడ్డి కీలక భూమిక పోషించారు. దీంతో ఇద్దరి మధ్య స్నేహబంధం మరింత బలపడింది. కాగా 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో పట్నం మహేందర్‌రెడ్డి ఓటమి చెందారు. ఆ తర్వాత వరుసగా జరిగిన ఎన్నికలలో తన కేడర్‌ను గెలిపించుకున్నారు. మహేందర్‌రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఇంత వరకు బాగానే ఉన్న 2019లో కాంగ్రెస్ నుంచి గెలిచిన తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి కారెక్కారు. నాటినుంచి తాండూరులో వర్గపోరు మొన్నటి ఎన్నికల వరకు కొనసాగింది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నంకు బీఆర్ఎస్ టికెట్ దక్కలేదు. దీంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన పార్టీ మారితే బీఆర్ఎస్‌కు నష్టం వాటిల్లుతుందని భావించిన అధిష్టానం ఎంపీ రంజిత్‌రెడ్డిని పట్నం వద్దకు పంపించి రాజీ కుదిర్చారు. అనంతరం ఆయనకు అమాత్య పదవి కట్టబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు ప్రతికూలంగా వచ్చాయి. అందుకు పట్నం కుటుంబమే ఓటమికి కారణమని పార్టీ నాయకులు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. మరోవైపు పట్నం సునీతారెడ్డి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి తన కేడర్‌ను బలపరుచుకున్నారు. ఈ విషయం తెలిసినా ఎంపీ రంజిత్‌రెడ్డి అదే స్థానం నుంచి హస్తం గుర్తుపై పోటీ చేసేందుకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పట్నం వర్గీయులు ఎంపీ రంజిత్‌రెడ్డి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీగా గెలిపించిన కుటుంబానికే వెన్నుపోటు పడిచేలా రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శలు చేస్తున్నారు.

కండువాలు మార్చిన కేడర్

జిల్లాలో పట్నం మహేందర్‌రెడ్డి కేడర్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. బీఆర్ఎస్‌లో ఉన్న పట్నం అనుచరులు తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. కాగా చేవెళ్ల పార్లమెంట్ టికెట్ మనకే వస్తుందంటూ సునీతారెడ్డి గులాబీ కేడర్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చారు. ఆమె ఎంపీగా విజయం సాధిస్తే తమ రాజకీయ భవిష్యత్ మారుతుందని భావించిన పెద్ద ఎత్తున హస్తం గూటికి చేరారు. ఢిల్లీ రాజకీయాలతో పట్నం సునీతారెడ్డికి చెవెళ్ల టికెట్ రాదనే ప్రచారం మొదలైంది. తమను కాంగ్రెస్‌లో చేర్పించి రాజకీయంగా దెబ్బతీశారంటూ జిల్లాలో పట్నం కేడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.